
క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు


మరిడమ్మ వారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇల వేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ వారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అలాగే పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, చండీ హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న హెడ్ కానిస్టేబుల్ రాజు

సామర్లకోట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ ఎస్‌జీకే రాజు అన్నారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తొలుత స్వచ్ఛ పక్వాడాలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత ఆవశ్యకతపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బీఆర్‌ఎస్ శివకుమార్, టీఎస్ పద్మావతి, వి.దుర్గాప్రసాద్, ఆర్.శివకుమార్, కేజీ భవానీ, పి.బ్రహ్మానందం, జి.జ్యోతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సత్కారం



పూర్వ విద్యార్థులను సత్కరించిన ఎంఈఓలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సామర్లకోట: కాపవరం మండల పరిషత్తు పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఎంఈఓలు శుక్రవారం సత్కరించారు. పూర్వ విద్యార్థులు పురం అరుణ్‌కుమార్ ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా, రాగం రాజ్‌కుమార్ సివిల్ కానిస్టేబుల్‌గా, పోలవరపు అజయ్ ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. దాంతో వారిని పాఠశాల హెచ్‌ఎం వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్యలు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆశాలత, దుర్గాదేవి, చిన్ని, విద్యా కమిటీ చైర్మన్ రత్నంరాజు, గ్రామ పెద్దలు అర్జున్, సుధాకర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్తు సరఫరా ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఈఎస్‌డీఎస్ ప్రభాకర్ శుక్రవారం పేర్కొన్నారు. స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్‌లో 33/11 కేవీ మరమ్మతుల కారణంగా బ్రౌన్‌పేట, పాత తహసీల్దార్ కార్యాలయం, కుమ్మరవీధి, గణేష్ కాలనీ, సీతారామ కాలనీ, బళ్లమార్కెట్, వీర్రాఘవపురం, తెలుకులపుంత, పెన్షన్ లైన్, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, మఠం సెంటర్, గోలివారి వీధి, మెహర్ కాంప్లెక్స్, ఇస్మాయిల్ నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, పెద్దాపురం వాటర్ వర్క్స్, సామర్లకోట వాటర్ వర్క్స్, పంచారామ క్షేత్రం ఏరియా, టిడ్కో గృహ సముదాయం, కోదండరామపురం, జల్లూరు రోడ్డు, నిమ్మకోట, కొత్తూరు వీధి, స్టేషన్ సెంటర్, సత్యనారాయణపురం, మాజేటి నగర్, ఏడీబీ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దసరా సెలవుల ఆకస్మిక మార్పు తగదు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవిజయ్

బాలాజీచెరువు: క్యాలెండర్ ప్రకారం ఖరారు చేసిన దసరా సెలవులను ఒక్కరోజు ముందు మార్పు చేయడం వల్ల అకడమిక్ క్రమశిక్షణ దెబ్బతింటుందని ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఫెడరేషన్ ఫౌండర్ ఎం.శ్రీవిజయ్ అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని ఎంఎస్‌ఎన్ పాఠశాలలో జరిగిన ప్రైవేట్ విద్యా సంస్థల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా సెలవుల విషయంలో ప్రభుత్వ మార్పు సరికాదన్నారు. దీనివల్ల షెడ్యూల్ మారుతుందని, తద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఇచ్చే అకడమిక్ క్యాలెండర్‌పై నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. విద్యా శాఖ విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంలో దృష్టి సారించాలని, సెలవుల కంటే ఇతర అంశాలపై పురోగతి సాధించాలని సూచించారు.

కోనేటి కష్టాలు

- పాదగయలో పుణ్య స్నానాలకు ఇబ్బంది
- కలుషితమైన పుష్కరిణి
- ముందు జాగ్రత్త చర్యల్లో అధికారులు విఫలం


పుష్కరిణిలో పిండాలు వదులుతున్న భక్తుడు


దుర్గంధభరితంగా మారిన పాదగయ పుష్కరిణి

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో పుణ్య స్నానాలకు భక్తులు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. ఇక పర్వదినాల్లో వేలాది మంది తరలి వస్తుంటారు. అలాంటి పుణ్య స్నానాలకు ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల సమయంలో ఆటంకం ఏర్పడుతున్నా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠం పిఠాపురం పాదగయ క్షేత్రంలో పురుహూతికా అమ్మవారు వెలిశారు. అమ్మవారి దర్శనానికి దేశ విదేశాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. ఇక దసరా ఉత్సవాలు ప్రారంభమైతే రోజూ అమ్మవారి ఆలయం కిటకిటలాడుతుంది. వేలాది మంది భవానీ భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు చేస్తుంటారు. అంతటి ప్రాధాన్యం కలిగిన పుష్కరిణి ఉత్సవాల సమయానికి కలుషితమై దుర్వాసన వెదజల్లుతున్నా ఆలయ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. శరన్నవరాత్ర ఉత్సవాలకు 15 రోజుల ముందు నుంచీ మహాలయ అమావాస్య వరకూ ప్రముఖ శైవ క్షేత్రమైన పాదగయ క్షేత్రంలో భారీగా పిండ ప్రదానాలు చేయడానికి భక్తులు తరలివచ్చి పూజల అనంతరం పిండాలను పాదగయ పుష్కరిణిలో కలిపారు. బియ్యం పిండి, అరటి పండ్లు తదితర వాటిని పుష్కరిణిలో వేయడంతో పూర్తిగా కలుషితమై దుర్వాసన వెదజల్లుతోంది. మహాలయ అమావాస్య వెళ్లిన మరునాడే శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాల్లో పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కానీ మహాలయ పక్షం సందర్భంగా కలుషితమైన నీటిని తొలగించాలంటూ ఆలయ అధికారులు పుష్కరిణిలో నీటిని తొలగించనుండడంతో నవరాత్ర ఉత్సవాలకు పుణ్యస్నానాలు లేనట్టేనని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏటా ఇదే తంతు

ప్రతి ఏటా మహాలయ పక్షం వస్తుందని తెలుసు. దాని అనంతరం శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిసినా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారని భక్తులు విమర్శిస్తున్నారు. పిండ ప్రధానాల వల్ల పుష్కరిణి కలుషితమైందని, దానికి ప్రత్యామ్నాయంగా బోరు నీటితో జల్లు స్నానాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పుష్కరిణిలో చేస్తేనే పుణ్యస్నానం అవుతుందని, బోరు నీటిలో చేస్తే పుణ్యస్నానం ఎలా అవుతుందని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

ముందే తెలిసినా..

మహాలయ పక్షం రోజుల్లో 15 వేలకు పైగా పిండ ప్రదానాలు చేయగా, సుమారు టన్ను వరకూ పిండ ప్రదాన వస్తువులు పాదగయ పుష్కరిణిలో కలిపే అవకాశం ఉందంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో నీటిలో కలిసిన బియ్యం పిండి, ఇతర వస్తువులు త్వరగా కుళ్లి నీటిని కలుషితం చేస్తాయి. ఈ విషయం తెలిసినా ఆలయ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతోనే ఏటా ఈ పరిస్థితి ఎదురవుతుందంటున్నారు. ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిసినా అధికారులు నీటిని శుద్ధి చేసే ఏర్పాట్లు చేయాలి. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడమేంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

> **జల్లు స్నానాలకు ఏర్పాట్లు**
>
> మహాలయ పక్షం సందర్భంగా భారీగా పిండ ప్రదానాలు చేయడంతో పాదగయ పుష్కరిణి కలుషితమైంది. దీంతో నీరు దుర్వాసన వెదజల్లుతూ స్నానాలకు వీలు లేకుండా తయారైంది. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా పాదగయ పుష్కరిణికి దగ్గరలో జల్లు స్నానాలు ఏర్పాటు చేశాం. మహాలయ అమావాస్య అనంతరం పాదగయ పుష్కరిణిలో నీరు తొలగించి కొత్త నీటితో నింపుతాం
>
> –కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఈఓ, పిఠాపురం పాదగయ క్షేత్రం

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్

పెద్దాపురం: ఈ నెల 21న గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని పీసీసీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా దేశభక్తి గీతంలోని అంశాల ఆధారంగా చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు. 21న మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోటీలు జరుగుతాయన్నారు. 3, 4, 5 తరగతులు సబ్ జూనియర్స్‌గా, 6, 7, 8 తరగతులు జూనియర్స్‌గా, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్స్‌గా, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు సూపర్ సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అంజలి, జగదీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

లేఖర్ల సమ్మెతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు


సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో నిరసన తెలుపుతున్న లేఖర్లు


పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న లేఖర్లు

సామర్లకోట: స్థానిక సబ్ రిజిస్ట్రార్ డివిజన్ పరిధిలో లేఖర్లు శుక్రవారం పెన్‌డౌన్ నిర్వహించారు. దీంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన 2.0 రిజిస్ట్రేషన్ విధానంతో ఇబ్బందులపై రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్ర, శనివారాల్లో పెన్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్ల సంఘ అధ్యక్షుడు ఎం.సీతాపతిరావు తెలిపారు. ఓటీపీ విధానం కేవలం యజమానికి మాత్రమే ఉండే విధంగా చూడాలన్నారు. వారసులు కూడా ఓటీపీ చెప్పాలనే నిబంధన సరి కాదన్నారు. ఇంటి నుంచి బయటకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి గతంలో మాన్యువల్ విధానంలో రిజిస్ట్రేషన్ చేయడం జరిగేదన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంతో ల్యాబ్‌టాప్ ఇళ్లకు తీసుకు వెళుతున్న సమయంలో నెట్ పనిచేయక ఇబ్బందులు పెరుగుతున్నాయని చెప్పారు. ఓటీపీ విధానం వల్ల నెట్ పనిచేయకపోతే తిరిగి మొదటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయాల్సి వస్తుందన్నారు. దీని కారణంగా రోజుకు ఒక రిజిస్ట్రేషన్ కూడా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు అమ్మకందారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఓటీపీ విధానంతో ఆస్తికి రక్షణ ఏర్పడుతుందని, అయితే వాటిలో మార్పు చేయాలన్నారు. ఈ మేరకు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సంఘ ఉపాధ్యక్షుడు షేక్ లాల్‌మహ్మద్, కార్యదర్శి పేకేటి చినపుత్రయ్య, సహాయ కార్యదర్శి గోగు అప్పారావు, కోశాధికారి ఎస్.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం: రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపు మేరకు పిఠాపురం రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద లేఖర్లు పెన్‌డౌన్ నిర్వహించారు. దీంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా పిఠాపురం లేఖర్ల సంఘం నాయకులు యదాల పాపారావు, వెలుగుల సూర్యప్రకాశరావు, లోవ ప్రసాదు, పసుపులేటి సత్యనారాయణ, అవసరాల రామారావు తదితరులు మాట్లాడుతూ ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పలువురు దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు.

పాదగయకు పోటెత్తిన భవానీ భక్తులు


పాదగయలో భవానీ దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వారం రోజులుగా దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలోని పదో శక్తి పీఠమైన పురూహూతికా అమ్మవారి దివ్య సన్నిధిలో వేలాదిమంది భవానీ దీక్ష తీసుకుంటున్నారు. మాలధారణ చేసిన భక్తులతో ఆలయం నిండిపోయింది. రోజూ 2 వేలకు పైగా భక్తులు భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ దేవి, పురూహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో వేలాది మంది భవానీ దీక్షలు చేపట్టారు. పాదగయ క్షేత్రంతో పాటు గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం, ఇతర దేవాలయాల్లో రోజూ వందల మంది భవానీ దీక్ష స్వీకరిస్తున్నారు.

22 నుంచి దసరా వేడుకలు

సామర్లకోట: స్థానిక మాండవ్య నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకూ శరన్నవరాత్ర వేడుకలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి శుక్రవారం తెలిపారు. సోమవారం ఉదయం ఆలయంలోని అమ్మవారికి క్షీరాభిషేకం, కలశ స్థాపన, విశేష దశ సహస్రనామ పూజ, క్షీరాన్న ప్రసాద వినియోగం, సాయంత్రం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ప్రతి రోజూ భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించుకోవడానికి ఆలయంలోని అర్చకుల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఆలయ అర్చకులు రఘురామ్ ఆచార్యులు, అనంత పద్మనాభ ఆచార్యులు, రవికుమార్ తదితరులు పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి


పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు


కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద..

పెద్దాపురం: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సమస్యలను కూటమి ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని పెద్దాపురం వీఆర్‌ఏల సంఘ నాయకులు దువ్వాపు వీరబాబు, సుందరపల్లి రామలింగేశ్వరరావు, చింతపల్లి సాయిభువన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రెండో రోజు పెద్దాపురం వీఆర్‌ఏ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. 20న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం, 21న జిల్లా కలెక్టరేట్ వద్ద శాంతియుత ధర్నా చేపడతామన్నారు. వీఆర్‌ఏలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నూకతట్టు వెంకటరమణ, గంపల వీరబాబు, గొర్ల సత్యవేణి, షేక్ బీబీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల వీఆర్‌ఏల అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించే వరకూ తమ నిరసన కొనసాగుతుందన్నారు. సంఘ కార్యదర్శి అప్పలస్వామి, కోశాధికారి అప్పారావు, ఎం.రాంబాబు, పి.సత్తిబాబు, డి.నానిబాబు, యు.సీత, ఎం.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువనూ ఆక్రమించి..


కాలువను ఆక్రమించి నిర్మించిన భవన ప్రహరీ

కొత్తపల్లి: ఆక్రమణలు అధికారుల కళ్లెదుటే జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.. ఫలితంగా కాలువల్లో నీరు ప్రవహించని పరిస్థితి ఏర్పడుతోంది.. కొత్తపల్లిలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వెనుక కాలనీలో మురుగు కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇక్కడ డ్రైన్‌ను పూర్తిగా ఆక్రమించి ఓ ఇంటి ప్రహరీ నిర్మించారు. దీంతో పాటు ఇంటికి సంబంధించిన ర్యాంపును కూడా ప్రధాన రోడ్డుపైకి వేశారు. ఇంటి రెండు వైపులా డ్రైనేజీలను పూర్తిగా ఆక్రమించి నిర్మాణం చేపట్టడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా డ్రైనేజీపై నిర్మించిన ఆక్రమణను పరిశీలించామని అన్నారు. సంబంధిత యజమానికి నోటీసులు ఇచ్చామన్నారు.

సమష్టి కృషితోనే స్వచ్ఛభారత్


రైల్వే ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న స్టేషన్ మేనేజర్, ఇతర అధికారులు

సామర్లకోట: సమష్టి కృషితోనే స్వచ్ఛభారత్ సాధ్యమని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వాడకంతో కలిగే అనర్థాలను ఆయన వివరించారు. ప్లాట్‌ఫామ్, స్టేషన్ ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, కాగితాలను తొలగించారు. ఈ మేరకు ప్రయాణికులు, రైల్వే ఉద్యోగులతో కలసి స్టేషన్ రైల్వే స్టేషన్ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమాల్లో హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గిరి, టీటీఐ చైతన్య, చీఫ్ గూడ్స్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, పార్శిల్ సూపర్‌వైజర్ మోసీద్దీన్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం


తిరుపతిలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

పెద్దాపురం: మహిళలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని పెద్దాపురం ఎంపీడీఓ కె.వెంకట సూర్యనారాయణ అన్నారు. తిరుపతి గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో స్వస్థ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..


కొత్తపల్లి: మహిళలు ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాలని కొత్తపల్లి, కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సుష్మ, రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉప్పాడ - 2, కొండెవరం - 2 గ్రామాల్లో ఉన్న సచివాలయాల వద్ద శుక్రవారం స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య పరిస్థితులను బట్టి పరీక్షలు అవసరం అవుతుందన్నారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ప్రత్యూష, ప్రణీత, వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి


కొంగోడులో ఎస్‌డబ్ల్యూఎస్ కేంద్రం పనితీరును పరిశీలిస్తున్న సీఈఓ లక్ష్మణరావు

కరప: గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి రోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం డీపీఓ నడకుదురు గ్రామంలో, సీఈఓ కొంగోడులో పర్యటించి పారిశుధ్య పనులు నిర్వహణను తనిఖీ చేశారు. పంచాయతీ సిబ్బందికి, కార్యదర్శులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులను కలసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి తడి, పొడి చెత్త తీసుకువెళుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువును ఎలా తయారు చేస్తారో వివరించారు. కంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లో తక్కువ ధరకు లభించే కంపోస్టు ఎరువుతో గృహాల్లో పూల మొక్కలు పెంచుకోవడానికి, కూరగాయలు పండించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు వెళ్లి, వాటి నిర్వహణను డీపీఓ రవికుమార్ పరిశీలించారు. స్వర్ణ పంచాయతీలో సామిత్వ సర్వే తదితర అంశాల పనితీరును అధికారులు పరిశీలించి, అనుసరించాల్సిన విధి విధానాలపై సూచనలిచ్చారు. రోజూ గ్రామ కార్యదర్శులు పంచాయతీ యాప్‌లో లాగిన్ అయి నిర్వహిస్తున్న కార్యకలాపాలను అప్‌లోడ్ చేయాలన్నారు. మొబైల్ యాప్‌లో గ్రామ పంచాయతీల పనితీరును డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు డీపీఓ, సీఈఓలకు వివరించారు. కార్యదర్శులు కె.వారిజ, జి.దుర్గాప్రసాద్, పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వాహన మిత్ర నమోదుకు గడువు పెంచాలి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వాహనమిత్ర పథకంలో నమోదుకు గడువు మరో వారం రోజులు పెంచాలని సీఐటీయూ నాయకులు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో, క్యాబ్ వాహనదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయం కోసం నమోదుకు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ సమయం ఇచ్చిందన్నారు. సచివాలయాల్లో కొన్ని సందర్భాల్లో సర్వర్లు పనిచేయక పోవడంతో నమోదు ప్రక్రియ ఆలస్యం అయ్యిందన్నారు. ఒకరి వాహనం మరొకరు కొనుగోలు చేసినప్పుడు రికార్డు ట్రాన్స్‌ఫర్‌కు కూడా సర్వర్లు పనిచేయని సందర్భంలో జాప్యం జరిగిందన్నారు. వాహనమిత్ర పథకాన్ని వాహన యజమానులతో పాటు ఆటో, క్యాబ్ వాహనాలపై ఆధారపడే డ్రైవర్లకు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.